'ప్రదీప్‌గారు మీరేనా?' పోస్ట్‌మేన్ అడిగాడు - లుంగీ కట్టుకుని ద్వారానికి అడ్డంగా నిల్చున్న శాల్తీని చూసి.

'ప్రదీపా - ఎక్కడో విన్నట్లుందే - నన్ను పార్వతమ్మ మొగుడంటారు' చెప్పాడు.

'అతగాడొస్తే చెప్పండి - అతనికో పార్సిలు ఉంది. ఇంటి నెంబరు సరిపోయింది. పోస్టాఫీసుకొచ్చి తీసుకొమ్మనండి.' అంత పార్సిల్‌ను మోసుకొచ్చిందానికి నిరుత్సాహపడుతూ వెనుతిరిగాడు.

'అలాగే - ఇంతకీ ఏం పార్సిలది?' అనుమానపడ్డాడు.

'మాకెలా తెలుస్తుందీ? మేం తెరిచి చూడంగా. లోపల పుస్తకాలే ఉన్నాయో? బాంబులే ఉన్నాయో' కాస్త ఎకసెక్కంగా అన్నాడు వెనుదిరిగిన వాడు ఇటు తిరిగి.

బాంబు అన్న మాట వినంగానే భయపడ్డాడు - చేతిలో వున్న సెల్లు అందుకుని రింగు కొట్టాడు. అట్నించి 'హలో' అని వినిపించింది.

'ఎవరూ - పార్వతమ్మగారేనా మాట్లాడేది' అడిగాడు.

'పార్వతమ్మ సెల్‌కు రింగిచ్చి - పార్వతమ్మేనా మాట్లాడేదీ అంటావు - ఎవరయ్యా నువ్వు?' కసురుకుంది అట్నించి. స్పీకర్ ఆన్‌లో ఉండటంతో బయటకు వినిపిస్తున్నది.

'నానా అండి... పార్వతమ్మ మొగుడంటారులెండి' చెప్పాడు.

'అయ్యబాబోయ్ మీరా! నన్ను అండి అంటారేవిటండీ - మతిపోయిందా - నేను మీ పెళ్ళాన్ని పార్వతిని'

'అయితే నేనెవర్ని?'

'మీరు నా మొగుడు - ఇంతకీ ఎందుకు సెల్లు రింగిచ్చారు - అవతల బోల్డు బిల్లు పడిపోతుంది... చెప్పండి త్వరగా' కంగారుపెట్టింది పార్వతి.

'అవును - ఎందుకు రింగిచ్చాను - నీతో ఏదో చెబుదామనుకున్నాను - అవునయ్యా నేనేం చెప్పాలనుకున్నాను?' పోస్ట్‌మేన్‌ని అడిగాడు.

'బాగుందండీ... మీరేం అడగాలనుకున్నారో నాకెలా తెలుస్తుంది - ఈ పార్సిలు మోయలేక నేను చస్తూంటే పైగా ప్రశ్నలు'

ఈ మాటలు అటు వైపు చేరాయి - అట్నించి వెంటనే

'హలో... మీరెవరితో మాట్లాడుతున్నారు? రోజులు బాగోలేవు - అందరినీ నమ్మొద్దు. దొంగ వెధవలు పట్టపగలే దోచుకుంటున్నారు - మీరసలే గొర్రెలు - ఊరికే నమ్మేస్తారు - ఏ గాడిద వచ్చి పిలిచినా తలుపు తీయొద్దు నే వచ్చేదాకా' పార్వతి కంగు కంగున చెప్పి సూచనలు జారీ చేసింది.

పోస్ట్‌మేన్ మొహం కందగడ్డలా తయారైంది.

'అవునేవ్ - ఇక్కడ పోస్ట్‌మేన్ అని ఒకడొచ్చాడు - చేతిలో పెద్ద పార్సిల్ ఉంది. దాంట్లో పుస్తకాలున్నాయో - బాంబులున్నాయో తెలియదంటున్నాడు - ఇంతకీ నీకేమైనా కావాలయ్యా?' విసుగ్గా అడిగాడు.

'ప్రదీప్ గారున్నారా?' కోపంగా అడిగాడు పోస్ట్‌మేన్.


'ఎవడో గాడిద ప్రదీపట - అతగాడు కావాలిట - నీకేమన్నా తెల్సా?'

'అయ్యో! మీ మతి మండిపోను! మీ కాలేజీ స్నేహితులు మిమ్మల్ని ముద్దుగా పిలిచేది ప్రదీపనేగా- గుర్తు లేదా?' కోప్పడింది పార్వతి.

'ఆ! కరెక్టేనోయ్! వాళ్ళు పార్వతమ్మ మొగుడని

# లిల్లీ ఫ్రం ఢిల్లీ

**-కె.వి.ప్రసాద్ (వియోగి)**



కాదు పిలిచేది ప్రదీపనే'

'అమ్మయ్య! ఈ పార్సిల్ తీసుకోవయ్యా - నే వెళ్ళాలి' పోస్ట్‌మేన్ తొందరపడ్డాడు.

'ఏమేవ్! నాకేదో అనుమానంగా ఉంది - ఈ పార్సిల్ తీసుకోమంటున్నాడు - తీసుకోవాలా వద్దా - ఇతగాడు కొత్తగా ఉన్నాడు - ఎప్పుడూ వచ్చే పోస్ట్‌మేన్ కదా' సందేహంతో అడిగాడు.

'వద్దంటే ఏం చేస్తారో అడగండి'

'వెనక్కి తిప్పి పంపిస్తాం' పోస్ట్‌మేన్.

'మరి ఆ పని చెయ్యమని చెప్పండి - ఇంతకీ ఎక్కడ నుండి వచ్చింది'

'ఢిల్లీ నుండి లిల్లీ పంపింది' పోస్ట్‌మేన్ చెప్పాడు.

'ఏయ్ మొద్దబ్బాయ్! నీకు లిల్లీ అనే సిల్లీ ఫ్రెండ్ ఢిల్లీలో ఉందా?' అడిగింది.

'నన్ను నమ్ము పార్వతీ! నాకు లిల్లీ అనే సిల్లీ ఫ్రెండు ఢిల్లీలో కాదు, ఊరి గల్లీలో కూడా లేదు - పొద్దున్నే ఏ పిల్లి మొహం చూశానో తల్లీ, ఇలా అపనిందల పాలయ్యాను' మొత్తుకున్నాడు ప్రదీప్.

'అయ్యా! మీ రిద్దరూ తర్వాత వాదులాడుకుందురుగాని - ఇక్కడ ఒక సంతకం పాడేస్తే నేను ఈ పార్సిల్ మీకిచ్చిపోతాను - వచ్చి అరగంట అయింది' అతను తొందరపడ్డాడు.

'అందుకే గదయ్యా సెల్లు చేసింది - అంతేగానీ నీ సొల్లు కబుర్లు వినడానికి కాదు. డెసిషన్ మేకింగ్ అంత ఈజీనా? మా ఆవిడ ఊళ్ళో ఉంటే ఇట్టే నిర్ణయం తీసుకునేది - అది ఊరికి పోయి నా ఊపిరి తీసింది' గయ్‌మన్నాడు.

'ఓయ్! పోస్ట్‌మేనయ్యా - మా ఆయనసలే ఒట్టి మనిషి కాదు - ఒట్టి అమాయకుడు. ఆయన్నేం చెయ్యమాకు - నేను రేపొచ్చినప్పుడు ఇద్దువుగాని వాపసు తీసుకుపో' చెప్పింది.

అరికాలి మంట నెత్తికెక్కింది సదరు పోస్ట్‌మేన్‌కు.

'అరే! నేను మీ కంటికి ఎలా కన్పిస్తున్నాను. మీకు ప్యూన్‌లా కనిపిస్తున్నానా? మీరు తెమ్మంటే తేవడానికి - వద్దంటే తీసుకుపోవడానికి? ఇరగదీస్తా! వద్దనుకుంటే తిరస్కరించినట్టు ఉత్తరం రాసివ్వు - వెనక్కి పంపిస్తా - అంతేగాని ఇలా తిప్పితే మర్యాద దక్కదు' ఒంటికాలి మీద లేచాడు.

'అయ్యో! అయ్యో! మిమ్మల్ని అనేసి మాటలలంటూ ఉంటే అలా నిమ్మకు నీరెత్తినట్లుంటారేమిటి? ఏదొకటి చెయ్యండి' పార్వతి 'సిగ్గు లేదా? మొగాళ్లు కాదా?'

'చూడు పార్వతీ! నన్ను అన్నాడు కాబట్టి బతికిపోయాడు - నిన్ను ఒక్క మాటన్నా నేనూరుకోనుగా - ఇంతకీ పార్సిల్ ఏం చేద్దామంటావ్?' శాంతంగా అడిగాడు.

'ఫ్రీగా వస్తే ఫినాయిలు కూడా తాగమని మీ నాన్నగారు అంటూ ఉండేవారు. అందుకని దాన్ని తీసేసుకుని ఓ మూలగా పెట్టండి. నేను వచ్చింతర్వాత తెరిచి చూద్దాం - జాగ్రత్త. బిల్లుతో జేబు చిల్లు పడుతుంది. ఉంటా'

'ఓర్నీ! ఈ మాత్రం దానికి అంత లావు కాలు చెయ్యాలా- ఓ పొట్టి సంతకం పాడవచ్చుగా' మొహం చిటపటలాడిస్తూ ఆ పార్సిల్ అతని కందించాడు.

సదరు ప్రదీప్ దాన్ని మోయలేక కిందపెట్టాడు.

'ఇంత బరువున్న దాన్ని ఎలా మోసుకొచ్చావయ్యా మగడా?' అడిగాడు.

'మరి అదే! పార్సిల్ భారీగా ఉంటే భారీగా గిఫ్టు ఇస్తావని తెచ్చాను. ఎంతిస్తావో ఇచ్చుకో' చెయ్యి చాపాడు పోస్ట్‌మేన్.

మళ్ళీ సెల్ ఆన్ చేశాడు.

'మళ్ళీ ఏమొచ్చింది?' అట్నించి అరుపు-

'బహుమానం కావాలిట ఇతగాడికి - పార్సిల్ ఇచ్చిందానికి!'

'అయితే అతన్ని పట్టుకుపొమ్మనండి - మనమే పోయి తెచ్చుకుందాం'

'విన్నావుగా - వెనక్కి తీసుకుపో' చెప్పాడు.

'బాబు - నా వల్ల కాదు - ఇప్పటికే గాడిద బరువు మోశాను - కనీసం ఓ యాభై కొట్టించండి' చేయి చాచాడు.

మళ్ళీ ఫోన్ - గుంజాటన - చివరికి పది రూపాయలిచ్చి పంపాడు.

పోస్ట్‌మేన్ తిట్టుకుంటూ పోయాడు.

ప్రదీప్ దాన్ని భద్రంగా మోసుకుపోయి లోపల బీరువా పైన పెట్టాడు.

అతనికి ఎంత ఆలోచించినా లిల్లీ ఎవరో గుర్తు రావడం లేదు.

అయినా ఢిల్లీతో అతనికి కనెక్షన్లు లేవు. ఒక్క వోటు వేసే సమయానికి తప్ప.

అసలే పెళ్ళాం ఊళ్ళో లేదు - అన్ని పన్లు తను చేసుకోవాలంటే కష్టంగా ఉంది. ఆపైన ఇలాంటి చిక్కు ప్రశ్నలొకటి!

పార్వతి మొగుడి పేరు ప్రమోదాల దివ్య ప్రహ్లాద్ - అది కాస్తా స్నేహితుల చేతుల్లో పడి రకరకాలుగా మారుతూ కాలేజీ రోజుల్లో కొచ్చేసరికి ఫ్యాషన్ కోసం ప్రదీప్‌గా మారిపోయింది.

పెళ్ళికాని ముందు అతని పేరు అతనికి బాగానే గుర్తుండేది.

ఎప్పుడయితే పెళ్ళయిందో - పార్వతి ఎప్పుడయితే వేరు కాపురం పెట్టించిందో - అతగాడ్ని అందరూ పార్వతి మొగుడు అనడం మొదలుపెట్టారు.

దానికి తగ్గట్టు ప్రహ్లాద్‌కు నిర్ణయం తీసుకోవాలంటే చాలా కష్టమైన పని. అది వాళ్ళ వంశంలోనే ఉంది. వాళ్ల తాత మేజిస్ట్రేట్‌గా పని చేశాడు. అతడు ఏ కేసూ వెంటనే తెంచేవాడు కాదు. వాయిదాలపైన వాయిదాలు వేసేవాడు.

అలాగే ఇతగాడి తండ్రి కూడా ప్రభుత్వంలో పెద్ద హోదా వెలగబెట్టాడు. తన చేతిలో పవర్సు ఉన్నా కూడా ఏదీ ఒక నిర్ణయం తీసుకునేవాడు కాదు. చిన్న సమస్యలైతే కింది వారిని పరిష్కరించమనేవాడు. జటిలమైన సమస్య లయితే పై వారిని సంప్రదించేవాడు. సాధారణ సమస్యలనయితే తన తోటివారిని సర్దుబాటు చెయ్యమనేవాడు. ఆ రకంగా కొన్ని సమస్యల్ని క్రింది వారిని - క్లిష్టమైన వాటిని పై వారి నిర్ణయాల మీద - మామూలువి కొలీగుల సహకారంతో పరిష్కరింపజేసి పబ్బం గడుపుకునేవాడు. ఏదీ కాకపోతే వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కాలం పరిష్కరించేదాకా ఊరుకునేవాడు.

ఆ జీన్సు ప్రభావం పాపం ప్రహ్లాద్ లేదా ప్రదీప్ లేదా పార్వతి మొగుడిలో కూడా వచ్చేసింది.

దానికి తోడు పార్వతికి తొందర జాస్తి - తెలివి జాస్తి. సహనం నాస్తి - అస్తి మెండు. ఒకత్తె ఆడపిల్ల కావటంతో ఆమె ఆడింది ఆట - పాడింది పాట! అన్నదమ్ముల ఆదరణ - తల్లిదండ్రుల ప్రేమ ఎక్కువగా ఉండి - పుట్టింటిపైన మమకారం గోదారిలా పొంగి పొర్లుతూ ఉంటుంది. కొంచెం ప్రోత్సాహం లభించి ఉంటే తన మొగుడు చేసే గొర్రెతోక బెత్తెడు ఉద్యోగం మాన్పించి తనూరుకు లాక్కుపోయేదే! 'దానికేం తొందరలే' అని అట్నించి ఆపుతూ వచ్చారు పెద్దలు.

పార్వతి అడుగుపెట్టినప్పటి నుంచి తన స్టేటస్‌కు అతని గుమాస్తాగిరి తగదని తెగ వాపోయి - ఎట్లాగయినా అతన్ని ఉన్న పళానా ఆఫీసరు కమ్మని శతథా పోరుతూండేది. దాంతో అతగాడు కూడా ఉత్తర కుమారుడులా ఢంబాలు పలుకుతూ అటు గ్రూప్ వన్ సర్వీసులకు - ఇటు సివిల్ సర్వీసులకు - బ్యాంకు పీవోలకు రెచ్చిపోయి కట్టి పారేసేవాడు.

ఎడాపెడా సెలవులు పడేస్తూ నానా పరీక్షలు రాస్తూ నానా యాగీ చేసేవాడు.


దాంతో అతని ఆఫీసు వాళ్ళకు ఇతగాడంటే వొళ్లు మంట! ఎక్కడ పైకి పోతాడోనని భయం.

వివాహం విద్యనాశాయ - శోభనం సర్వ నాశాయ సామెత పూర్తిగా తగలకపోయినా - కొంచెం తగిలింది - అతడి జీవితానికి.

'మీరు ఆఫీసరయ్యేదాకా మనకు పిల్లలొద్దండి' పార్వతి చెప్పేది.

'అదేంటే లోకంలో ఒక్క ఆఫీసర్లకే పిల్లలున్నారా - గుమాస్తాలకు ప్యూనులకు పిల్లలు పుట్టడం లేదా' అని ఆశ్చర్యపోయేవాడు.

'అయ్యో! నా పిల్లాడు మీలాగా గుమాస్తా కొడుకు అని పిలవబడటం నాకిష్టం లేదు - అందంగా ఆఫీసరు గారి



పార్వతికి తొందర జాస్తి - తెలివి జాస్తి. సహనం నాస్తి - అస్తి మెండు. ఒకత్తె ఆడపిల్ల కావటంతో ఆమె ఆడింది ఆట - పాడింది పాట! అన్నదమ్ముల ఆదరణ - తల్లి దండ్రుల ప్రేమ ఎక్కువగా ఉండి - పుట్టింటి పైన మమకారం గోదారిలా పొంగి పొర్లుతూ ఉంటుంది.

అబ్బాయి అని పిల్చుకోబడాలి - చక్కటి కారుల్లో తిరుగుతూ ఉండాలి' పార్వతి అనేది.

'నిజమే! అలా భీష్మించుకు కూర్చుంటే - చివరికి మనకి వయసు ముదిరిపోయి - వృద్ధాప్యంలో చేతికి అందొస్తారో లేదో!' అని సందేహించేవాడు.

'ఇండియాలో పిల్లలు పుట్టడం సమస్య కాదు. పుట్టకుండా ఉండటమే కష్టం. మీకా భయం అక్కర్లేదు. మీరు తొందరగా పెద్ద ఆఫీసరైపోండి... ఆపైన చకచకా నలుగుర్ని కనండి - కాదన్ను' అంది.

ప్రహ్లాద్ తన తల్లిదండ్రులు ముద్దుముచ్చట తీర్చాల్సిన బాధ్యత తమపైన ఉందని నచ్చజెప్పబోయాడు. ఫలితం - అలిగి అతన్ని పస్తులు పడుకోబెట్టి పుట్టింటికి పారిపోయేది.

ఈ బాధలు పడలేక ఆమె చెప్పినట్లే వినడం మొదలెట్టాడు.

అప్పట్నించి అతడికి కష్టాలు మొదలయ్యాయి. అడ్డమైన జికె పుస్తకాలు - పేపర్లు - ఉద్యోగ ప్రకటనలు ఇంటికి వచ్చి పడేవి.

కష్టపడి పరీక్ష పాసైనా ఇంటర్వ్యూలో తుస్సుమనేది.

ఖర్మచాలి ఇంటర్వ్యూ కూడా బాగా చేసినా ఆ పోస్టుకు ఇన్ని లక్షలు లంచం ఇవ్వగలవాని బేరాలు జరిగేవి.

అన్ని లక్షలు లేక - ఇవ్వడం ఇష్టంలేక - కొత్తవాడ్ని నమ్మి వాడి చేతిలో పెట్టే ధైర్యం లేక - అన్నింటికి మించి వాళ్లు పెట్టిన గడువులోపల నిర్ణయం తీసుకునే సామర్థ్యం లేక - ఆఫీసరు కలగా మిగిలిపోయింది.

ఉన్న సంస్థలోనే అయిపోదాం - పైకి పోదామనుకుంటే - అతని లీవు రికార్డు అడ్డు పడుతూండేది. పైగా వాళ్ల ప్రమోషన్ పాలసీ ఒక అయ్య అమ్మకు పుట్టలేదు. 'వ్యక్తిని చూపిస్తే రూలు చెబుతాను' అన్న సూత్రం మీద నడిచేది ఆ సంస్థ.

అంతేగాక అన్నీ చేసి పెట్టే అతని భార్యను చూసి - ఇతగాడి అదృష్టాన్ని చూసి వాళ్ళ ఆఫీసులో జెలసీ! పైగా ఆ ఆఫీసుకు చాడీలే ఊపిరి. కింద ఆఫీసులో దగ్గినా తుమ్మినా ఆ రాత్రిలోపు పై ఆఫీసుకు చేరిపోవలసిందే. పని కంటే కూడా పని కట్టుకుని చాడీలు చెప్పేవాళ్లే చాలా పైకి వస్తారు. అంచేత ఇతగాడు తన లోకంలో తానుండటం వల్ల ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉండిపోయాడు ఎదుగూ బొదుగూ లేకుండా.

అది కూడా పార్వతికి అవమానంగా ఉండేది - కనీసం మీ ఆఫీసులో కూడా ఒక మెట్టు ఎగబాకపోయావు అని ఏడిపిస్తూ ఉండేది - ముద్దుగా మొద్దబ్బాయి అని పిలుస్తూ ఉండేది.

ధైర్యం చేసి అతడు ఒకటి రెండు నిర్ణయాలు తీసుకుంటే అవి ఘోరంగా దెబ్బతిన్నాయి. అందుకని అప్పటి నుండి ప్రహ్లాద్ భగవద్గీతలోని కృష్ణ తత్వాన్ని నమ్ముకున్నాడు. అన్నీ పార్వతి చేతిలో వదిలిపెట్టాడు. రిమోట్ పార్వతమ్మకు ఇచ్చాడు.

అప్పట్నించి కూడా అతని ఇరుగు పొరుగుకు చుట్టు పక్కల వాళ్లకే గాకుండా - చుట్టాల్లో కూడా పార్వతి మొగుడుగా చలామణి అయిపోతున్నాడు. చివరికి అతని సొంత పేరు మర్చిపోయి - ఎవరన్నా పార్వతి మొగుడు గారు అని పిలిస్తే తొందరగా స్పందించడం మొదలుపెట్టాడు.

పెళ్ళయి పదేళ్ళయినా పిల్లాపాపలు లేక కొందరు చులకనగా కూడా చూస్తున్నారు.

మరునాడు పార్వతి బుట్టాతట్టతో దిగబడింది.

స్నానం చేసి కాస్త తేరుకున్న తర్వాత బీరువా మీంచి పార్సిల్ కిందకు దింపించింది. అటూ ఇటూ పరిశీలనగా చూసింది.

'ఇంతకీ ఇది ఎవరు మీకు పంపారో తెలీదు కదండీ?' ఆరా తీసింది.

'నీ మీదొట్టు - నిజంగా నాకు తెలీదే' చెప్పాడు.

'మరి లిల్లీ ఫ్రం ఢిల్లీ అని ఉంది'

'లిల్లీ ఏ గల్లీలో ఢిల్లీలో ఉంటుందో కూడా నాకు తెలీదు తల్లీ'

'సంథింగ్ రాంగ్! మీకు తెలియని వాళ్ళు మీకు పార్సిల్ పంపించారు'

'అదే నాకూ అర్థం కావడం లేదు'

'కొంపదీసి ఇదేమన్నా పార్సిల్ బాంబా?' పార్వతి అనుమానం.

'పార్సిల్ బాంబు నాకు ఎందుకు పంపుతారు పార్వతీ?' భయంగా అడిగాడు.

'ఇందులో ఏదో విదేశీ హస్తం ఉన్నట్లుంది' ఇంకా అనుమానించింది.

'అందులో ఏముందో నాకు తెలీదు. పుస్తకాలున్నాయో విదేశీ హస్తముందో - బాంబుందో' వాపోయాడు తల గోడకేసి బాదుకుంటూ.

'అస్సలు మీరెందుకు తీసుకున్నారండీ ఈ పార్సిల్‌ను - వాడి మొహాన కొట్టి ఉండాల్సింది' కస్సుమంది పార్వతి ఇన్ని కష్టాలు వచ్చినందుకు.

'నువ్వే తీసుకోమన్నావుగా' గుర్తు చేశాడు. నిర్ణయం తను తీసుకోనందుకు సంతోషిస్తూ.

'ఈ తెలివితేటలకేం తక్కువ లేదు - నేను తీసుకోమన్నంత మాత్రాన మీరు తీసుకోవడమేనా? ఏమన్నా జరిగితే నన్ను ఆడిపోసుకోవడానికి' దెప్పింది.

(మిగతా 27వ పేజీలో)

(9వ పేజి తరువాయి)

'పోనీ - పోస్ట్‌మేన్‌కు వాపసు ఇచ్చిరానా?' దీనంగా అడిగాడు.

'ఇప్పుడు వాళ్లెందుకు తీసుకుంటారు - ముందే మా ఆవిడ ఊళ్ళో లేదని తప్పించుకోవాల్సింది' మెటికలు విరిచింది పార్వతి ఏం చెయ్యాలో తెలీక.

'జరగాల్సింది ఆలోచించు పార్వతీ - నాకు ఆఫీసు టైమై పోతోంది. ఇవ్వాళన్నా జాయిన్ కావాలి!' చెప్పాడు ఏడ్పు మొహంతో.

'ఉండవయ్యా మొగడా! చావో బతుకో అర్థంకాక నీ ఛస్తూ ఉంటే ఆఫీసుకు పోవాలిట. గుండెల మీద బాంబును పెట్టుకుని మీరు ఆఫీసుకు పోతే అది పేలి నేను ఛస్తే - టింగురంగా అంటూ రెండో పెళ్ళి చేసుకుని నా సవతితో కులుకుదామనేనా!' పార్వతి మొగుడి మీద ఎగిరింది.

'నా మాటకు ఇంత భాష్యం ఉందని తెలీదు పార్వతి. అయినా నువ్వు సివిల్సు ఎందుకు రాయలేదు - గబుక్కున కలెక్టరై పోయేదానివి!' విచారించాడు ఆమెను అభినందిస్తూ పార్వతి మొగుడు.

'అదే నాకు మండుద్ది! ముందు జరగాల్సింది చూడాలిగాని - నన్ను పొగడ్డం దేనికి!' మళ్ళీ విసుక్కుంది ఆ అప్రస్తుత ప్రసంగానికి.

'బయటకు పోయి మొగాళ్ళను పిల్చుకురమ్మంటావా?' అడిగాడు.

'అది నాకు అవమానం కాని - నేనే పక్కింటి అమ్మలక్కలను పిల్చుకు వస్తాను'

'దానికి నువ్వు వెళ్ళాలా పార్వతీ! నే పోయి పిలవగలను'

'ఇదేం పేరంటం కాదు పిలవడానికి - దీన్ని బయట పెట్టి గట్టిగా కేకలేస్తే వాళ్లే వస్తారు' అంటూ మొగుడి సాయంతో ఆ పార్సిల్‌ను వరండాలోకి చేర్చి గట్టిగట్టిగా కేకలు పెట్టింది. నాలుగు దిక్కులా చూస్తూ. ఆమెకు తెల్సు పక్కింటి చెవులెప్పుడూ తమ ఇంటివైపే ఉంటాయని.

ముందస్తు ఎదురింటి కాంతయ్య వచ్చాడు. అతను విఆర్ఎస్ తీసుకుని గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడు - రోజూ పొద్దుపోవడం కష్టంగా ఉంటుంది.

ఆ తర్వాత ఆ పక్కింటి కామాక్షి వచ్చింది.

ఆ తర్వాత ఈ పక్కింటి తాయారు తయారై పోయింది. విషయం చెప్పింది.

'ఏవమ్మా! ఇన్నాళ్లు ఎక్కడికి మాయమైపోయావు! కుక్కిన పేనులా అన్నయ్యగారు ఇంట్లో చడీచప్పుడు లేకుండా పడి ఉన్నారు' కామాక్షి అడిగింది.

'అవన్నీ తరువాత - మాకు పార్సిల్ వచ్చింది - ఏమై ఉండచ్చు'

'చూస్తే తెలుస్తుందిగా - ఇప్పుదీయండి' కాంతయ్య చెప్పాడు.

'ఏదీ మీరు విప్పుతారా?' తాయారు అడిగింది కవ్విస్తూ.

ఇంతలో కామాక్షికి అనుమానం వచ్చింది. ఆమెవి పాము చెవులు.

'ఏమ్మా పార్వతీ ఇందులో ఏదో టిక్కుటిక్కు అంటున్నది - కాస్త విను'.

నివ్వెరపోయింది పార్వతి - చెవి పెట్టి వింది - ఏదో శబ్దం వినిపిస్తున్నది. నిజమే! టిక్కుటిక్కు అని - ఇంకేదో అర్థం కావడం లేదు.

'కచ్చితంగా బాంబు ఉంటుంది - తెలిస్తే మనం దరం మటాష్' సెలవిచ్చాడు కాంతయ్య తాపీగా.

'చిన్నపామునైనా పెద్ద పాముతో కొట్టాలన్నారు - మనం దూరంగా నిలబడి పార్వతమ్మ మొగుడు గార్ని ఓపెన్ చెయ్యమందాం' తాయారు చెప్పింది దూరంగా జరుగుతూ.

'అది కాదు - దాన్లో ఏముందో? ఆర్‌డిఎక్స్ ఉందో? టైంబాంబు ఉందో? ఈ మధ్య టెర్రరిజం పెరిగిపోయింది - ఆ మధ్య లుంబినీ పార్కులో - ఆబిడ్స్ సెంటర్‌లో - ఇంకా చాలాచోట్ల బాంబులు పేల్చారు - ఆ బాంబు పవరు మనకి తెలీదు కదా - పోలీసులను పిలిస్తే!' కామాక్షి చెప్పింది.

'ఏముంది ముందు నన్ను బొక్కలోకి తోస్తారు - బాంబు ఎక్కడ్నించి వచ్చిందో చెప్పమని హింసిస్తారు - లిల్లీకి నాకు ఏ ఇల్లీగల్ సంబంధం ఉందో తేల్చమని చావగొడతారు - నా కొద్దు బాబోయ్ - ఆ పోలీసులు - కోర్టులు చుట్టూ తిరుగుతూ ఉంటే నా ఉద్యోగం ఊడుద్ది'

'అన్నగారు - మీరన్నా ఓపెన్ చెయ్యకూడదు' పార్వతి కాంతయ్యని అడిగింది.

'అమ్మా! మీకేం చెబుతారు - పిల్లాపీచూ లేరు - నాకు పిల్లా మేకలున్నారు. నేపోతే వారిగతేం కాను - తాయారును ట్రై చెయ్యమనండి' చెప్పడు కాంతయ్య.

'అంటే నే పోయినా ఫర్వాలేదు - చూడు పార్వతమ్మా! మాకు చాలా పన్లున్నాయి! వస్తా' విసవిసా వెళ్లిపోయింది తాయారు.

'కామాక్షి అక్కయ్యా - నువ్వు తోడుంటే ఓపెన్ చేద్దాం' పార్వతి.

'రిటైరైన కాంతయ్యకే అంత భయం ఉంటే నాకుండదా ఇంకా యాభై అరవై ఏళ్ళు జీవించాల్సిన దాన్ని - దాన్ని తీసుకుపోయి ఏ ఏట్లోనో విసిరెయ్యండి' సలహా ఇచ్చింది కామాక్షి.

ఇంతలో అటు పోతున్న పోలీసు కానిస్టేబుల్ ఇటుగా వచ్చాడు. 'ఏంటీ విషయం' అంటూ వాకబు చేశాడు - నలుగురూ ఒకచోట చేరడం అతనికిష్టం ఉండదు.

లాఠీతో పార్సిల్‌ను టపటప కొట్టాడు - వాళ్లు చెప్పింది విని.

లోపల టిక్కుటిక్కు శబ్దాలు ఎక్కువయ్యాయి.

'కచ్చితంగా బాంబు స్క్వాడ్‌కు ఫోన్ చేయాల్సిందే' అని సలహా ఇచ్చాడు.

'పార్వతీ! ఇవన్నీ ఎందుకే - దీన్ని తీసుకుపోయి ఎదురుగా ఉన్న కెసి కెనాల్‌లో పారేసి వస్తాను' చెప్పాడు చివరికి ప్రహ్లాద్ 'అదీ నువ్వు చెబితేనే' అని తన నిర్ణయాన్ని సరిచేసుకున్నాడు మళ్ళీ.

'అయ్యో! నాకున్నది మీరొక్కరే మొగుడు! మీకేమన్నా అయితే నేను ఎలా బతకాలి - నేను పోయి పారేసి వస్తాను - నేను పోయినా మీరింకో పెళ్ళి చేసుకుని బతకొచ్చు' అంటూ పార్వతి ఆ పార్సిల్‌ను అందుకుంది.

'పోలీసన్నా సాయం పట్టన్నా!' అని పిలిచింది పార్వతి.

అతను - అతనితోసహా మిగతా వాళ్ళు ఎప్పుడో పారిపోయారు.

చివరికి స్వాతి - ఆమె మొగుడు దాన్ని మోసుకుంటూ పోయి కెనాల్‌లోకి విసిరేశారు. అక్కడ ఈతలు కొడుతున్న పిల్లలు చూసి ఈదుకుంటూ పోయి దాన్ని లాక్కుని ఒడ్డుకు పట్టుకొచ్చారు - ఏ సంకోచం లేకుండా.

పార్వతి - వాళ్ళాయన వారించినా వినకుండా విప్పదీయసాగారు.

ఇద్దరూ దూరంగా పోయి నిల్చున్నారు చెట్టుచాటున.

దాన్లోంచి ఒకటొకటి బయటకు తీయసాగారు.

ఇద్దరూ తొంగి చూశారు. లోపల నుండి పసిపిల్లలు ఆడుకునే ఆటబొమ్మలు బయటికి తీస్తున్నారు కేరింతలు కొడుతూ.

ధైర్యం చేసి దగ్గర కొచ్చారు - మంచిమంచి ఎలక్ట్రానిక్ ఆటబొమ్మలు 'ఆంటీ - లెటరుంది ఇందులో' అంటూ ఆ కుర్రాడు కాగితం అందించాడు.

'ప్రదీప్! నీకు పిల్లలు పుడితే నీతో సంబంధం కలుపుదామనుకుంటుంటే - ఎప్పటికీ కనవేంరా! కనీసం ఈ పసిపిల్లలు మీ కళ్ళ ఎదుట ఉంటే మీ బాధ్యత మీకు గుర్తొస్తుందని పంపుతున్నాను. ఈ మధ్యే మావారు ఢిల్లీ ట్రాన్సఫరయ్యారు - ఎప్పుడైనా రండి - ఇట్లు నీ స్నేహితురాలు లీలావతి' ఉత్తరం చదివి ఇద్దరూ వెర్రి మొహాలేసుకున్నారు.

★


<u>రచయిత చిరునామా</u>

కె.వి.ప్రసాద్ (వియోగి)

ఎల్ఐసి ఆఫ్ ఇండియా, న్యూబస్టేషన్ వద్ద

ఆదోని - 518 301

కర్నూలు జిల్లా.